సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా పరుగులు

- రెండేళ్లలో కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పూర్తి
- సర్పంచ్ ఎన్నికల్లో మంచోళ్లకు అవకాశమివ్వండి
- సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఒక్కసారి ఆశీర్వదిస్తేనే రెండేళ్ల అధికారంలోనే ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం.. పదేళ్లుఅధికారం ఇస్తే వందేళ్లకు సరిపడా అభివృద్ధి చేసి చూపెడతాం. సర్పంచ్ ఎన్నికల్లో మంచోళ్లకు అవకాశమివ్వండి.. ముంచేవాళ్లను దూరం పెట్టండి... కాళ్లల్లో కట్టెలు పెట్టేవాళ్లు... హాఫ్, ఫుల్ బాటిల్స్ పట్టుకుని వస్తారు. వాళ్ల మాయలో పడితే అభివృద్ధికి అడ్డుపడినట్టే.. మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి గ్రామాభివృద్ధికి నిధులు తెచ్చేవారిని ఎన్నుకోండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. మంత్రి శ్రీహరి అధ్యక్షతన మక్తల్‌లో రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. 'ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో గత ప్రభుత్వం రూ.8లక్షల కోట్లు అప్పు చేసి మనపై భారం మోపింది. ఆ సంక్షోభాన్ని అధిగమిస్తూ.. సంక్షేమం వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నాం. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ద్వారా రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేయబోతున్నాం. రెండేళ్లలో కొడంగల్ మక్తల్ నారాయణపేట ఎత్తిపోతలను పూర్తి చేసి పాలమూరుకు సాగునీరు అందివ్వాలనే లక్ష్యం పెట్టుకున్నాం. 96 శాతం రైతులు భూములిచ్చారు.. ఎవరైనా అడ్డు పడితే ఊరుకోబోం.. ఈ దిశగా పనులు పూర్తి చేయాలి. లేదంటే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం..' అని అన్నారు. ఈ సభతోనే స్థానిక ఎన్నికలకు శంఖారావం పూరిస్తున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాదు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సైతం పాలమూరు జిల్లాపై వివక్ష కొనసాగిందన్నారు. కూతవేటు దూరంలో ఉన్న కృష్ణానది నీటిని బీడు భూములకు మళ్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లా నుంచి సాధారణ వ్యక్తులు కూడా ఎమ్మెల్యేలుగా గెలిచారని, మీ ఆదరాభిమానాలతోనే తాను ఈ రాష్ట్రానికి రెండో సిఎం అయ్యానని అన్నారు. తట్ట బుట్ట నెత్తిన పెట్టుకుని వలసలు పోయే ఈ జిల్లా ప్రజలకు త్వరలోనే సాగు నీరు అందిస్తామని హామీనిచ్చారు.

కరువు జిల్లా నుంచి ఎంపిగా గెలిచిన మాజీ సిఎం కెసిఆర్ పాలమూరు ప్రాజెక్టులకు మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ సంగం బండ పగలగొట్టడానికి కనీసం రూ.12 కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. తాను సిఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్దండాపూర్ నిర్వాసితులకు 100 శాతం పరిహారం అందించామన్నారు. 2014లో తెచ్చిన 69 జీఓను తొక్కి పెట్టి కొడంగల్ నారాయణపేటకు తీరని అన్యాయం చేశారని అన్నారు. తాము కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలను చేపట్టామన్నారు.

మహబూబ్‌నగర్ పరిధిలో ఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏండ్ల తరబడి ఎస్సీ వర్గీకరణకు నోచుకోలేదని, సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే తాము తెలంగాణలో అమలు చేశామని గుర్తు చేశారు. పశువులు, జంతువులు చివరికి చేపల లెక్కలు తేల్చిన కెసిఆర్ బిసిల లెక్కలు తేల్చలేదని అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రాన్ని 2047వరకు గొప్ప రాష్ట్రంగా తీర్చి దిద్దుతామని ప్రకటించారు. ఇందులో భాగంగానే ఈనెల 8, 9,10 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

కాంగ్రెస్ బలపరిచ్చిన వారినే ఎన్నుకోవాలి..

అభివృద్ధికి గీటురాయిగా ఉన్న కాంగ్రెస్ బలపరిచిన వారినే సర్పంచులుగా గెలిపించాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోధర రాజనర్సింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిట శ్రీహరి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, మేఘారెడ్డి, ఈర్లపల్లి శంకర్, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నాయకులు సీతాదయాకర్‌రెడ్డి, కార్పోరేషన్ చైర్మెన్ శివకుమార్‌రెడ్డి, శివసేనారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- నిర్దేశిత సమయంలో పనులు పూర్తికావాలి
- మేడారం అభివృద్ధి పనులపై సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధికారులు, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని.. ఏ మాత్రం పొరపాటు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని తన నివాసంలో సిఎం సమీక్ష నిర్వహించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ యాత్రికుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, యాత్రికులు వేచి చూసే ప్రదేశాలు ఇలా ప్రతి ఒక్క అంశంపైనా అధికారులకు సిఎం సూచనలు చేశారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించారు. తద్వారా పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని దిశా నిర్దేశం చేశారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి కే.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీశ్, ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి...

- హడ్కో చైర్మన్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సీఎం హడ్కో చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి... హడ్కో ఛైర్మన్‌ల మధ్య చర్చ సాగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్ట్రక్చన్) అంశాన్ని సిఎం హడ్కో ఛైర్మన్ దష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హడ్కో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సీఎం కోరారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు అసెంబ్లీలో తీర్మానించాలి

- హక్కుల సారధి పోరాటాల వారధి
- సిఐటియు : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కోడ్‌లపై రైతు ఉద్యమ స్ఫూర్తితో యావత్ కార్మిక లోకం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి పిఆర్‌రెడ్డి భవనంలో సోమవారం సిఐటియు జిల్లా రెండో మహాసభ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ ప్రసంగిస్తూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలన్నారు. కార్మికులు యూనియన్లు పెట్టుకుని పోరాడే హక్కును తొలగించేందుకు ప్రయత్నిస్తూ యజమానులకు అవకాశం కల్పిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఇది కార్మికుల శ్రమను దోచుకోవడమే అన్నారు. సింగరేణి, ఎల్‌ఐసి, గనులు, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తోందని విమర్శించారు. మహాసభలో భవిష్యత్ ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మోడీ ప్రజ్యావతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌ల వల్ల పనిగంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచుకునే అవకాశం యజమానులకు ఏర్పడిందని, కార్మికులు కనీస వేతనాలు అడిగే హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, కాసు మాధవి, కూరపాటి రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య, కార్యదర్శి రాగుల రమేష్, ఆఫీస్ బేరర్స్ జి ప్రభాకర్ రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్లా అశోక్, సంఘాల మొగిలి, బొల్లారం సంపత్, కె ఐలయ్య, రజిత, బి మహేష్, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పర్యావరణం కలిసి నడవాలి

- అప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యం
- కేంద్ర పర్యావరణ అప్రైజల్ కమిటీ చైర్మన్ ఇందర్ పాల్ సింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి, పర్యావరణం రెండూ కలిసి నడిస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అప్రైజల్ కమిటీ చైర్మన్ ఇందర్ పాల్ సింగ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో "కోల్ మైనింగ్, పర్యావరణ సుస్థిరత" వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు నేడు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాయని, అయితే ఈ విషయంలో ఇండియా కొంత వెనుకబడి ఉందని అభిప్రాయపడ్డారు. పర్యావరణానికి మానవాళి నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో ప్రకృతి ప్రకోపిస్తోందని గుర్తు చేశారు. ఫలితంగా. వరదలు, భూకంపాలు, ధ్రువ ప్రాంతంలో మంచు కరగడం, హిమాలయాలు కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి లాంటి సంస్థలు తమ కార్యాకలాపాలను విస్తరించే క్రమంలో పర్యావరణ రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

పర్యావరణ హితంగా మైనింగ్ : సింగరేణి సిఎండి బలరామ్

సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ దిశా నిర్దేశంలో తమ సంస్థ అన్నిచర్యలు తీసుకుంటూ మైనింగ్ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పర్యావరణ హితంగా ఓవర్ బర్డెన్ నుండి ఇసుక తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. వాతావరణ కాలుష్యం జరగకుండా మిస్ట్ స్ప్రేయింగ్, డ్రై ఫాగ్ డస్ట్ సప్రెషన్ పద్ధతులు అవలంబిస్తున్నామని వివరించారు. భూగర్భజలాల పెంపుకు నీటి బిందువు జలసింధువు అనే కార్యక్రమం ద్వారా 62 కొత్త చెరువుల నిర్మాణం చేపట్టామని, 45 చెరువుల్లో పూడిక తీశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుందర్ రామనాథన్, పర్యావరణ శాస్త్రవేత్తలు లలిత్ కపూర్, డాక్టర్ ఉమేశ్ జగన్నాథరావు కహలేకర్, డాక్టర్ సంతోష్ కుమార్ హంపన్నవార్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల సాధికారతకు సర్కారు భారీ ఊతం

- మరో 448 అద్దె బస్సులు కేటాయింపు
- మంత్రులు సీతక్క, పొన్నం సంయుక్త ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్‌టిసి అద్దె బస్సులు కేటాయించడానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 152 ఆర్‌టిసి అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో మరో 448 అద్దె బస్సులను మహిళా సంఘాలకే అప్పగించేందుకు ప్రక్రియ చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డికి లేఖ రాశారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తిచేసి, వాటిని ఆర్‌టిసికి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే, ఆ బస్సులను ఆర్‌టిసి అప్పగించనున్నట్టు పేర్కొన్నారు. దీంతో త్వరలోనే ఆర్‌టిసిలో మహిళా సమాఖ్యల ద్వారా నడిచే బస్సుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తోంది. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభించడం, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలకంగా మారింది. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల విజయవంతమైన నిర్వహణను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మహిళా సాధికారతకు దోహదపడే కీలక నిర్ణయం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్‌టిసి అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడడమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రత్యక్ష భాగస్వాములుగా మారడం ఎంతో సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ నిర్ణయం మహిళలకు నిరంతర, స్థిరమైన ఆదాయ మార్గాలను సష్టించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల నిబద్ధత, క్రమశిక్షణ రాష్ట్ర ప్రజా రవాణా రంగానికి కొత్త దిశను చూపుతుందన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇద్దరు మంత్రులు స్పష్టం చేశారు. మహిళలు స్వయం సమృద్ధిని సాధించి, రాష్ట్రాభివృద్ధిలో మరింత భాగస్వామ్యం అవడం ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్ నుంచి సిపిఎంలో చేరికలు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన జూలకంటి రంగారెడ్డి
- సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరాం : బిటెక్ విద్యార్థిని ఆలేటి బిందు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది సోమవారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. పేదల పక్షాన నిరంతరం పోరాడే సిపిఎంకు పేద ప్రజలు అండగా నిలవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఏనాడూ పదవుల కోసం ఆశించకుండా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. పేద ప్రజలు సిపిఎంకు అండగా నిలిచి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండానే ప్రత్యామ్నాయమని, యువకులు చైతన్యవంతులై సిపిఎంను బలపరచాలని కోరారు.

సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరా... ఆలేటి బిందు పేద ప్రజల కోసం పనిచేసే సిపిఎం సిద్ధాంతాలు నచ్చుడంతో తనతోపాటు తన కుటుంబం, బంధువులు, గ్రామంలోని యువకులు, మహిళలు పార్టీలో చేరినట్టు బీటెక్ విద్యార్థి ఆలేటి బిందు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం సిపిఎం చేస్తున్న ఉద్యమాలు ఎంతో గొప్పవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందని చెప్పారు. ఆలగడప గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తాను బరిలో నిలుస్తున్నానని, ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఆమెతో పాటు పూసపాటి నాగేందర్, పెద్ద పంగ మహేష్, మంద మహేష్, కొత్తపల్లి ఎల్లయ్య, కొత్తపల్లి శ్రీను, తోకల కోటయ్య, యార సుందరి, ఇంద్రపల్లి మధు, మీసాల వినోద్, యారం నాగరాజు మరి కొంతమంది చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పట్టిం రామచంద్రయ్య, పట్టేటి వెంకటయ్య, భాషబోయిన పాపయ్య, పి.వెంకటయ్య, గండెల శ్రీను, నాగేందర్, రామదాసు, వెంకటనారాయణ, సైదాచారి, ఇంద్రపల్లి సీమోను పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లుల్లోనూ పత్తి కొనుగోళ్లు

- ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సిసిఐ నోటిఫై చేసిన మొత్తం 330 జిన్నింగ్ మిల్లుల్లోనూ పత్తి కొనుగోళ్ల ప్రక్రియ చురుగ్గా కొనసాగుతుంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో పత్తి కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) విధించిన కొత్త నిబంధనల కారణంగా కొనుగోళ్లకు అనుమతులు లభించని జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్ల ప్రారంభించేందుకు మంత్రి తుమ్మల జరిపిన చర్చలు ఫలించాయి. దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సిసిఐ నోటిఫై చేసిన మొత్తం 330 జిన్నింగ్ మిల్లుల్లో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. సిసిఐ కొత్త నిబంధనల కారణంగా అనుమతులు లభించకపోవడంతో జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ గతంలో సమ్మెకు దిగింది. దీనివల్ల రైతులు తాము పండించిన పత్తిని అమ్ముకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మంత్రి తుమ్మల వెంటనే రంగంలోకి దిగారు. ఆయన కేంద్ర మంత్రులతో పాటు సిసిఐ సిఎండితో ప్రత్యేక చొరవ తీసుకుని వివరణాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చల్లో సానుకూల స్పందన రావడంతో, 330 మిల్లుల్లో కొనుగోళ్లకు అనుమతులు లభించాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 4.03 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ సేకరించగా, దీని కొనుగోలు విలువ రూ. 3,201 కోట్లుగా నమోదైనట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు.

మిల్లర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

సమస్య పరిష్కారంలో మంత్రి తుమ్మల చూపిన వేగవంత చర్యలకు, చొరవకు జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో వేలాది మంది రైతులకు, మిల్లుల కార్మికులకు ఉపశమనం లభించిందని ఆయన తెలిపారు.

మాస్ కాపీయింగ్ ప్రచారాన్ని ఖండించిన ఒయు

హైదరాబాద్ : నగరంలోని మలక్‌పేటలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో మాస్ కాపీయింగ్ జరుగుతోందంటూ సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) అధికారికంగా స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న విశ్వవిద్యాలయ పరీక్షలకు వైరల్ అవుతున్న వీడియోకు ఎటువంటి సంబంధం లేదని ఓయు తేల్చి చెప్పింది. కళాశాల భవనంపై అంతస్తులోని స్టోర్ రూమ్ నుండి పుస్తకాలు కింద పడుతున్న వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో దీనిపై ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురామ్ ఆదేశాల మేరకు, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కిషన్ విచారణ జరిపారు. వైరల్ వీడియోకు పరీక్షా ప్రక్రియతో ఎలాంటి సంబంధం లేదని తేలింది.

లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

- వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను పునరుద్ధరించాలి
- అసెంబ్లీలో తీర్మానం చేయండి
- కార్మిక శాఖ మంత్రి వివేక్‌కు టిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను అమలు చేయవద్దని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బి రాజశేఖర్, గుడిగ రఘు, పి రాధిక, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి మణిమాల, మేకల కష్ణ తదితరులు సోమవారం హైదరాబాద్ లో కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ను కలిశారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు మంత్రిని కోరారు. జర్నలిస్టుల యాక్సిడెంటల్ పాలసీని పునరుద్ధరించాలనీ, త్రైపాక్షిక కమిటీ నియమించాలని, కమిటీ లో హెచ్‌యుజెకి ప్రాతినిధ్యం ఇవ్వాలని, కనీస వేతనాల జిఒ సవరించాలని, రాత్రి వేళ మహిళా జర్నలిస్టులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ కోరారు. ఈ మేరకు ఫెడరేషన బందం మంత్రికి వినతిపత్రం అందజేసింది. మంత్రి స్పందిస్తూ, త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్మిక శాఖ పరిధిలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వివేక్ ఫెడరేషన్ బృందానికి హామీ ఇచ్చారు.

నోటీసు
మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
హెచ్.యమ్.ఒ.పి 250/2025
బిట్వీన్:
జెట్టి రామకృష్ణ ...పిటిషనర్
మరియు
రీని.జె.ప్రభ ...రెస్పాండెంట్టు
రెస్పాండెంట్: రీని.జె.ప్రభ భర్త: జెట్టి రామకృష్ణ, తండ్రి: జె.ఐ.శామ్యూల్(లేటు), నివాసం. సౌత్ ఎండ్ పార్క్, 14/3 లైన్, ఫ్లాట్ నెం.426, 3వ ఫ్లోర్, మన్సూర్ బాద్, హైదరాబాద్-500068, తెలంగాణ రాష్ట్రము.
పై నెంబర్ ఒ.పి లో పిటిషనర్, రెస్పాండెంట్ అయిన మిమ్మల్ని కాపురానికి రావాల్సిందిగా కోరుచూ మీపై ఒ.పి దాఖలు చేసి, మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున మీకు నోటీసు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.11-12-2025 వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ॥గ॥ 10-30 ని.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా: 11-12-2025
బి.శ్రీనివాస బాబ్జి, బి.ఏ,బి.యల్.,
పిటిషనర్ తరుపు అడ్వకేట్,
నరసరావుపేట-522601, సెల్: 9440525914

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో
H.M.O.P. No. 226/2025
కందెల వెంకటేశ్వర్లు... ..పిటీషనర్
V/s
కందెల @ దేవర శ్రావణి... రెస్పాండెంట్
To:
Kandela @ Devara Sravani W/o Kandela Venkateswarlu, D/o Devara Vijay, Present Residing at D.No. 2-28/4/86 New Colony, Street No.9, Miyapur, Hyderabad Town, Telangana State
పై నెంబరు హెచ్.యం.ఓ.పి దావాను విడాకుల నిమిత్తము మీ మీద దాఖలు చేసియున్నాము. సదరు హెచ్.యం.ఓ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు పలుమార్లు సమన్లు పంపగా, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున, శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తమై ఉత్తర్వులు జారీ చేసినందున ది.08-12-2025 వ తేదీ ఉ॥ 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడునని ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా : 08-12-2025
శ్రీ కె.సీతారామాంజనేయులు
శ్రీ బి. గోపిరాజు, పిటీషనర్ తరుపు అడ్వకేట్స్
నరసరావుపేట.
సెల్ : 93905 11530

BEFORE THE BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL- CUM-II ADDL CHIEF JUDGE :CITY CIVIL COURT : AT : HYDERABD
M.V.O.P.NO. 2211 OF 2024
BETWEEN:-
Smt. Tirupati Suguna ...Petitioner
And
Nama Anitha and 2 others ...Respondents
To
1. Nama Anitha, W/o N. Venkatesham Age: Major, Occu:Business, Plot No: 24, RD No .5, HUDA Sainagar colony, Vanasthalipuram, Hayath Nagar, R R District, Telangana -500070.
2. Nama Venkatesham, S/o Pentaiah, Age : 47, Occu : Driver, H.No.2-124, Golenepally Village, Valigonda Mandal, Ydadri Bhuvanagiri District - 508112, Telangana.
Take Notice that Smt. Tirupati Suguna has instituted the above O.P. against you as 1 st and 2 nd Respondents and others, claiming compensation under section 166 of the M.V.Act. Now the above O.P. stands posted to 11-12-2025 for your appearance. You are hereby directed to appear before the above court on 11-12-2025 At 10-30 A.M. Otherwise the O.P. would be decide setting you exparte.
BALLA RAVINDRA NATH, B.A., LL.M.,
K.SAVITRI DEVI
ADVOCATES
H.No.2-2-1109/5/B/5,301, . IV Floor, Block – B Bagh Amberpet, Hyderabad-13 Ph :9848798708

BEFORE THE HONBLE SUBORDINATE COURT AT ALANDUR
I.A.No. 1 of 2025
In
O. P. No. 678 of 2022
Mrs. Kalpakkam Rajamani,
D/o. Kalpakkam Natarajan
No. 6 (Old No. 8), 39th Street,
Nanganallur, Alandur, Kancheepuram,
Chennai, Tamil Nadu-600 061.
Petitioner/Petitioner
-Vs-
Mr. Raman Rajamani alias
Laxminarayan Raman Rajamani,
S/o. L. Subbu Raman,
C/o. S. V. Mohans Residence,
Apartment No. 101,
Road No. 2, Vivekanandapuram,
Near Ammaguda Railway Station,
Hyderabad, Telangana-500 056.
Respondent/Respondent
With reference to the above mentioned matter, the Respondent above is hereby informed to take notice that the aforementioned matter had come before the Honble Subordinate Court at Alandur on 16.10.2025 and the Honble Court was pleased to post the above matter to 19.12.2025 for your appearance. Please arrange to be present before the Honble Court on the said date.Take notice that in case of default, the Petition shall be heard and decided in your absence, in accordance to law.
M/s. NATHAN AND ASSOCIATES
Counsel for Petitioner

GIRIJAN COOPERATIVE CORPORATION LIMITED
East Point Colony, Visakhapatnam-17, A.P.
Ph:0891- 2796164,2581661 website:https://gcc.ap.gov.in/
Email ID:apgirijan1956@gmail.com
Rc.No.137/2025/Industries Dated:29-11-2025
INVITATION FOR EXPRESSION OF INTEREST(EOI) FOR SUPPLY OF RAW MATERIALS TO SOAP UNITS OF GCC Ltd.,
The Girijan Cooperative Corporation Ltd., (GCC),Visakhapatnam, invites Expression of Interest(EOI) from experienced firms for supply of Raw Materials, Chemicals,Oils, Perfumes and other ingredients, items to toilet Soap units at Vizianagaram and Araku valley for its rebranded wide range of toilet soaps for a period of two years (2025-26 to 2026-2027). Tender documents, other details can be obtained from the Office of Girijan Cooperative Corporation Ltd., East Point Colony, Opposite VMRDA Park, Chinna waltair, Visakhapatnam, A.P. - 530017 on all working days **(from 01-12-2025 to 22-12-2025 between 10.30 AM to 5.00 PM)** or download at https://gcc.ap.gov.in/. completed tenders in sealed cover along with EMD of multiple amounts **(by way of D.D.)** must be submitted on or before **23rd December,2025, up to 2.00 PM at GCC Office.** For details of tender document visit https://gcc.ap.gov.in/ Contact detais:**7799998696,7396759500.**
Sd/- VC & Managing Director

హైదరాబాద్‌లో అజయ్‌దేవ్‌గన్ ఫిల్మ్‌సిటీ

- పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న గ్లోబల్ సమ్మిట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం వినోదం, పర్యాటకం రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8-9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు దేశ - విదేశాల నుంచి భారీ స్పందన లభిస్తోంది. బాలీవుడ్ నటుడు అజయ్‌దేవగన్ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి ఫిల్మ్‌సిటీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకోనున్నారు. రిలయన్స్ గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నది. రిలయన్స్‌కు చెందిన వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ .. నైట్ సఫారి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర పర్యాటక రంగం రూపురేఖలు మారనున్నాయి. ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్ బి హోల్డింగ్స్ కంపెనీ రూ.3వేల కోట్లతో ఫ్యూచర్ సిటీలో మూడు హోటళ్లు నిర్మించేందుకు ఒప్పందం చేసుకోనున్నారు. ఈ కీలక ఒప్పందాలపై ఈ గ్లోబల్ సదస్సులో సంతకాలు కానున్నాయి.

'మెడి'కోల బాధలు

- పేరుకే ప్రభుత్వం.. అంతా ప్రయివేటుమయం
- ఒకే ప్రాంగణంలో ప్రయివేటు ఇంజనీరింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల
- మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో వసతులు శూన్యం
- నిత్యం 40 కిలోమీటర్ల మేర ప్రయాణం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన వైద్య కళాశాలల్లో చాలాచోట్ల కనీస సదుపాయాలు లేక మెడికల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. పేరుకు ప్రభుత్వ కళాశాలే అయినా.. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. కళాశాల ఒక చోట ఉంటే.. ప్రాక్టికల్స్ మరోచోట చేయాల్సి వస్తోంది. అటువంటి వాటిల్లో ఆ కళాశాల ఒకటి.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న భారత్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లోని అద్దె భవనంలో కొనసాగుతోంది. కళాశాల ఒక చోట.. ప్రాక్టిస్ మరో చోట నడుస్తున్నది. నిత్యం 40 కిలోమీటర్ల మేర వైద్య విద్యార్థులు ప్రయాణం చేయాల్సి వస్తోంది. భారత్ ఇంజనీరింగ్ కళాశాల కొనసాగుతున్న ప్రాంగణంలోనే.. మరో భవనంలో ప్రభుత్వ వైద్య కళాశాల నడుస్తోంది.

ఈ కళాశాల 2024 సంవత్సరంలో ప్రారంభమైంది. ప్రస్తుతం కాలేజీలో 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 60 మంది అమ్మాయిలు, 40 మంది అబ్బాయిలు.

కాలేజీలో లైబ్రరీ, ప్రయోగశాలలు, ఇతర ముఖ్యమైన బోధనా సౌకర్యాలు లేవు. పీజీ కళాశాల, విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోవడంతో ప్రయివేటు హాస్టళ్లలో ఉంటున్నారు. దాంతో ఉదయం, సాయంత్రం కలిపి ఆరు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తున్నది. ప్రతి విద్యార్థిపై ప్రతినెలా రూ.7,500-8000 వరకు భారం పడుతోంది. కాలేజీలో ప్రయోగశాలలు లేకపోవడంతో ప్రాక్టికల్ సెషన్స్‌లో జాప్యం జరుగుతోంది.

వైద్య విద్యార్థులపై ఆంక్షలు..

భారత్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోనే ప్రభుత్వ వైద్య కళాశాల ఉండగా.. బాలికల కోసం కేటాయించిన ప్రాంగణంలోనూ తగినంత భద్రత లేదని వాపోతున్నారు. వైద్య విద్యార్థుల వాహనాలను అనుమతించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వాహనాలను కూడా అనుమతించడం లేదని అంటున్నారు.

లైట్లు, కుర్చీలు లేకుండానే గ్రంథాలయం..

విద్యార్థులు చదువుకునేందుకు కళాశాలలో సెంట్రల్ లైబ్రరీని ఇటీవల ఏర్పాటు చేశారు. కానీ అక్కడ కూర్చునేందుకు కుర్చీలు, చదువుకునేందుకు బల్లలు లేవు. ఫ్యాన్లు, లైట్లు కూడా లేవు. విద్యార్థుల నుంచి అభివృద్ధి పేరిట నిధులు వసూలు చేసినా వాటిని వినియోగించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త భవనం ఇంకా పూర్తికాలేదు. కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ నిర్వహించే ఇంటర్ మెడిక్స్ క్రీడా పోటీలకు కావాల్సిన క్రీడా పరికరాలు కూడా లేవు. తమ సమస్యలు పరిష్కరించాలని వైద్య విద్యార్థులు తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్య డైరెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. దాంతో ఇటీవల తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్య డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కారించాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి
: బాయికాడి శంకర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

ఇబ్రహీంపట్నంలో అద్దెభవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి. క్యాంపస్‌లోనే ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటు చేయాలి. ప్రాక్టీకల్స్ కోసం రవాణా వసతిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. లేకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం. ఇదే విషయంపై కళాశాల ప్రిన్సిపల్ త్రివేణిని వివరణ కోరగా స్పందించేందుకు నిరాకరించారు.

గడువులులోగా 'మున్నేరు' పనులు పూర్తి చేయాలి

- భూసేకరణ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలి
- మార్చి 2026 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులపై నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇతర అధికారులతో కలిసి మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రస్తుతం వర్కింగ్ సీజన్ నడుస్తుందని, పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు మొదటి ప్రాధాన్యతగా, కేబుల్ బ్రిడ్జి నుంచి ప్రకాష్ నగర్ బ్రిడ్జి వరకు రెండో ప్రాధాన్యతగా పెండింగ్ భూసేకరణ త్వరగా క్లియర్ చేయాలని చెప్పారు. భూముల బదలాయింపు కోసం అడ్వాన్స్ పోజిషన్ వెంటనే అందించాలని రాష్ట్ర స్థాయి అధికారులను మంత్రి చరవాణిలో ఆదేశించారు. మార్చి 2026 నాటికి మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని, ప్రతి నెల ఎంత మేరకు పనులు పూర్తవుతాయో నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసి సమర్పించాలని, సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు, అధికారులకు సూచించారు. నూతన టెక్నాలజీతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగాలని, హైదరాబాద్ దుర్గం చెరువు, కరీంనగర్ మానేరు నదిపై గతంలో కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయని, రాష్ట్రంలో 3వ కేబుల్ బ్రిడ్జి ఖమ్మం నగరంలో నిర్మాణం అవుతుందని, దీనికి అవసరమైన పవర్ లైన్స్, విద్యుత్ స్తంభాల తరలింపు పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టిపి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను క్షేత్ర స్థాయిలో ప్రజలను ఒప్పించి పూర్తి చేసి సంబంధిత ఏజెన్సీలకు త్వరగా భూమి అప్పగించాలని అన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ యాకోబు, విద్యుత్ ఎస్ఇ, తహసీల్దార్‌లు రాంప్రసాద్, సైదులు, ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేషన్ వేయొద్దంటూ బెదిరించారు

- బాధితుడు మామిడి యాదగిరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మూత్రం కలిపిన మద్యం తాగాలంటూ.. నీ భార్య సర్పంచ్ పదవికి నామినేషన్ వేయొద్దంటూ కత్తులతో బెదిరించారు' అని కిడ్నాప్ బాధితుడు మామిడి యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామంలో ఈ నెల 28న కిడ్నాప్‌కు గురైన సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మి భర్త మామిడి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28న అధికార పార్టీ నాయకుడు నలుగురు వ్యక్తులతో కలిసి నన్ను కిడ్నాప్ చేయించి చిత్రహింసలకు గురిచేశాడు. మూత్రం కలిపిన మద్యాన్ని తాగాలంటూ.. "నీ భార్యని నామినేషన్ వేయకుండా ఆపాలంటూ" కత్తులు పట్టుకుని బెదిరిస్తూ ఫోన్ చేయించి చిత్రహింసలకు గురి చేశారు. అదే రోజు పోలీస్ స్టేషన్లో తెల్ల పేపర్ మీద సంతకం పెట్టించుకొని వారికి నచ్చినట్టుగా కంప్లైంట్ రాసుకొని వదిలేశాడు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సహకారంతో తాను పోలీసుస్టేషన్‌కు వెళ్లి కిడ్నాపర్లపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

బీసీలను అణచివేతకు గురిచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి : తీన్మార్ మల్లన్న

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన అనుచరులతో కిడ్నాప్ చేయించి.. బిసిలు నామినేషన్ వేయకుండా అణచివేతకు గురిచేయడం సరికాదని రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న అన్నారు. ఎల్లమ్మగూడెంలో మామిడి యాదగిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిగజారి రాజకీయాలు చేస్తున్నారన్నారు. బిసిలను అణగదొక్కేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు వట్టె జానయ్య, తదితరులు ఉన్నారు.

ఇబ్బందులు పెడుతున్న అసిస్టెంట్ మేనేజర్

- సిద్దిపేటలో ఆర్‌టిసి డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సింగల్ డ్రైవర్‌తో దూర ప్రాంతాలకు బస్సులు నడపాలని, కంటిన్యూగా డ్యూటీలు చేయాలంటూ అసిస్టెంట్ మేనేజర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆర్‌టిసి డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ మేనేజర్, డిపో మేనేజర్ వేధింపులను నిరసిస్తూ సిద్దిపేట బస్‌డిపో ఎదుట సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూల్, బీదర్, సోలాపూర్ వంటి దూర ప్రాంతాలకు సింగిల్ డ్రైవర్‌తోనే బస్సులు నడపాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలో ఎవరైనా చనిపోతే సెలవు అడిగితే చనిపోయిన వారి ఫొటో పెట్టాలని.. అప్పుడే సెలవు మంజూరు చేస్తానని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దూర ప్రాంతాలకు ఒక్కరే డ్రైవింగ్ చేస్తూ వెళ్లి రావాలంటే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కంటిన్యూగా నిద్రలేకుండా డ్యూటీలు చేయడం వల్ల అలసిపోయి, అనారోగ్యాలకు గురవుతున్నామని అన్నారు. గతంలో డ్యూటీలతో ఇబ్బందులు ఎదురై డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. సింగిల్ డ్రైవర్ కాకుండా డబుల్ డ్రైవర్‌తో డ్యూటీ వేయాలని, కంటిన్యూ డ్యూటీలు కాకుండా డే బై డే వేయాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి డ్రైవర్లు

ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం

- విద్య,వైద్యం, టెక్నాలజీ, ఇంధన రంగాలను బలోపేతం చేయాలి
- 2047 లక్ష్యాలను ఇండియా అప్పుడే చేరుకుంటుంది
- బిపి విఠల్ స్మారకోపన్యాసంలో మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రణాళికలు, స్థిరమైన విధాన నిర్ణయాలు, సంస్కరణలను పకడ్బందిగా అమలు చేస్తేనే 2047 వికసిత్ భారత్ లక్ష్యాలను ఇండియా చేరుకుంటుందని ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా అన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సిఇఎస్ఎస్) ఆధ్వర్యంలో "చాలెంజెస్ ఆఫ్ పాలసీ మెకింగ్ ఇన్ ఏ ఫాస్ట్ చేంజింగ్ వరల్డ్" అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో బిపి విఠల్ నాలుగో స్మారకోపన్యాసం నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రస్తుతం భారతదేశ వృద్ధి 6.5 శాతంగా ఉందనీ, దాన్ని ఎనిమిది శాతానికి పెంచినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. ప్రపంచ మార్కెట్‌ను నియంత్రిస్తున్న అమెరికా, చైనా లాంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి శాస్త్ర సాంకేతిక రంగాల్లో పోటీ ఏర్పడిందని గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆటొమోబైల్, ఇంటర్‌నెట్, ఎఐ లాంటి అడ్వాన్స్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని నొక్కి చెప్పారు. ఇందు కోసం దేశంలో విద్యావైద్యం, టెక్నాలజీ, ఇంధన రంగాల్లో బలమైన ముద్ర వేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికను మరింతగా తీసుకు పోవాలన్నారు. దేశంలో నేడు వాడుతున్న టెక్నాలజీ వల్ల అనేక నగరాలు కాలుష్యకారకాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇందన రంగ వాడకంలో పెద్ద ఎత్తున మార్పులు చేసి గ్రీన్ ఎనర్జీ వాడకాన్ని పెంచాలని సూచించారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన 30 ఏళ్ల తర్వాత కూడా దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో వెనకబడి ఉండడానికి, స్థానిక రాజకీయ విధానాలు, ప్రణాళికల అమల్లో వైఫల్యం తదితర కారణాలుగా అయన పేర్కొన్నారు. అభివృద్ధిని నగరాలకే పరిమితం చేయడం వల్ల భవిష్యత్‌లో ఆయా రాష్ట్రాల్లో అనేక సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని వికేంద్రీకరించి గ్రామాలకు తీసుకు పోవాలని సూచించారు. దేశంలోని అన్ని ప్రాంతాలు సమంగా అభివృద్ధి చెందాలంటే పాలన విధానాల్లో నూతన ఆవిష్కరణలు చేయడానికి రాష్ట్రాలకు అధికారం ఇవ్వాలని అన్నారు. బిపిఆర్ విఠల్ బ్యూరోక్రట్‌గా ఆర్థిక వేత్తగా గొప్ప ప్రణాళికలు రచించి అమలు చేశారని కొనియాడారు. ఆయన వారసత్వాన్ని సెస్ కొనసాగిస్తూ మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు. పద్మశ్రీ అవార్డు పొందిన సెస్ మాజీ చైర్మన్ కెఎల్ కృష్ణను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, డాక్టర్ డి సుబ్బారావు. ప్రొఫెసర్ జె. మహేందర్ రెడ్డి ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

నా ఆస్తులు పెరిగితే.. అవి ప్రజలకే..

- బాండ్ పేపర్ రాసిచ్చిన సర్పంచ్ అభ్యర్థి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్‌గా గెలిచాక నా ఆస్తులు పెరిగితే అవి గ్రామపంచాయతీకి రాసిస్తానని గుడితండా సర్పంచ్ అభ్యర్థి గుగులోతు జయపాల్ నాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువకులకు అవకాశం కల్పించాలన్నారు. సర్పంచ్‌గా గెలిచాక, తన ఆస్తులు పెరిగితే గ్రామపంచాయతీకి రాసిస్తానని బాండ్ పేపర్‌పై రాసి సమర్పించారు. గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు సేవకుడినై పనిచేస్తానని, తప్పుడు లెక్కలు చూపించబోనని అన్నారు.

హిల్ట్ విధానంపై గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న హిల్ట్ విధానంపై బిజెపి రాష్ట్ర శాఖ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫిర్యాదు చేసింది. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, శాసనసభాపక్షనేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్, ఎన్‌వి సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం' హైదరాబాద్ ఇండస్ట్రీయల్ ల్యాండ్స్‌లాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) విధానాన్ని అమల్లోకి తెచ్చిన విషయం విదితమే. 'హిల్ట్ పాలసి ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తొమ్మిది వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చిచూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి..కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అమలుచేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబరు ఏడున ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జిహెచ్‌ఎంసి విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయని' బిజెపి నేతలు అరోపించారు.

పూర్ణిమ స్కూల్ సీజ్

- యజమాన్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షాపూర్‌నగర్‌లో నాలుగేండ్ల చిన్నారిపై ఓ ప్రయివేటు పాఠశాల ఆయా అమానుషంగా వ్యవహరించిన ఘటన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. పూర్ణిమ స్కూల్‌లో జరిగిన ఈ దారుణంపై విద్యాశాఖ వెంటనే చర్యలకు ఉపక్రమించింది. స్కూల్‌ను సీజ్ చేసింది. పాప తండ్రితో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న ఆయా లక్ష్మి చిన్నారిని స్కూల్ ప్రాంగణానికి తీసుకెళ్లి దారుణంగా కొట్టింది. పాప కాళ్లపై నిలబడి కొట్టింది. ఈ ఘటనను స్కూల్ పక్క భవనం పై అంతస్తులో ఉన్న యువకుడు వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం బయటపడింది. పోలీసులు వెంటనే స్పందించి చిన్నారి కుటుంబాన్ని సంప్రదించారు. చిన్నారిని తల్లిదండ్రులతో కలిసి వెంటనే ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. బాలిక ప్రస్తుతం కోలుకుంటోంది. బాలానగర్ ఎసిపి నరేశ్ రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆస్పత్రిలో చిన్నారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయా లక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వారిపై కూడా కేసు నమోదు చేశారు.

సంఘటన గురించి వివరాలు తెలుసుకోవడానికి సోమవారం ఎంఈఓ జెమిలీ కుమారి స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని విచారించారు. పసిపాపపై ఆయా చేసిన దాడిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి డీఈవో విజయకుమారి, చైల్డ్ ప్రొటెక్షన్ కమిషనర్ సభ్యులు సరిత ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. వారి సూచనల మేరకు స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. పై అధికారుల ఆదేశాల మేరకు పూర్ణిమ స్కూల్‌ను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

యువతీ యువకుల ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఒకే కంపెనీలో పని చేస్తున్న యువతీయువకుడు.. యువతి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించి సిఐ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన నవనీత్ దత్త నాలుగేండ్ల కిందట తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కొత్తూరుకు వచ్చి లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తె అనామికదత్త (20) రవి ఫుడ్స్ పరిశ్రమలో పనిచేసేవారు. అక్కడే పనిచేస్తున్న ధనుంజయ పసి (25) అనే వ్యక్తితో అనామికకు పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అనామిక మూడ్రోజులుగా పనికి వెళ్లడం లేదు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనామిక పనికి ఎందుకు రావట్లేదంటూ ధనుంజయ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య ఏం జరిగిందో కానీ ఆత్మహత్య చేసుకున్నారు. నవనీత్ దత్త ఇంటికి వచ్చి చూడగా.. తన కూతురుతోపాటు మరో యువకుడు ఉరేసుకుని కనిపించారు. దాంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎసిపి శ్రీకాంత్‌గౌడ్ పరిశీలించారు. ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారా..? లేక యువతిని చంపి, యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా ఇద్దరినీ మరెవరైనా చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అనే విషయం విచారణలో తేలుతుందని ఎసిపి తెలిపారు. నవనీత్ దత్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

55న మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో నిజ నిర్ధారణ

- ఒయు విద్యార్థి సంఘాల నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నేపథ్యంలో అసలు వివరాలు బయటపడాల్సిన అవసరం ఉందని ఒయు విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. హైదరాబాద్ ఒయు ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి నాయకులు బట్టు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఇటీవల ఆ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా, అతని భార్య రాజేతో పాటు మరో నలుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు చెబుతున్నారని అన్నారు. మరుసటి రోజు జరిగిన మరో ఘటనలో ఏడుగురు సాయుధ మావోయిస్టులు మృతిచెంది నట్టు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. అయితే ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంస్థలు ఈ ఘటన ను "బూటకపు ఎన్‌కౌంటర్"గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ప్రకటనా ఇవ్వకపోవడం అనుమానాలకు కారణమవుతోందన్నారు. లెనిన్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పౌరుల ప్రాణాలు, హక్కులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరింపబడుతున్నాయో ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదుల్లో భయానక, గందరగోళ వాతావరణం నెలకొన్న ఈ పరిస్థితుల్లో సంఘటనకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కలిసి నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీ డిసెంబర్ 5న మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి వెళ్లి ఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తుందని, కాల్పుల్లో మరణించిన మావోయిస్టుల కుటుంబాలను కలుసుకుని వివరాలు సేకరించనున్నట్టు చెప్పారు. అలాగే, సంఘటనలో పాల్గొన్న ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డాను కూడా కలిసి స్పష్టత పొందేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, అలాగే మావోయిస్టు పార్టీకి బహిరంగ లేఖ పంపినట్టు వెల్లడించారు. ఈ నిజనిర్ధారణ కమిటీలో ఓయూ, కాకతీయ యూనివర్శిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతోపాటు దేశంలోని పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఉన్నారు. కార్యక్రమంలో విజయ్, పెంచాల సతీష్, నెల్లి సత్య, ఉప్పల ఉదయ్, పవన్ క్రాంతి, మహేష్, సుమన్, రవిచంద్ర, పాపారావు, మధు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు పట్నం ఓట్లే పట్టు

- ఒక్క ఓటు కోసం విందులు, రవాణా వరకు రిక్వెస్టులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వేడి మొదలైనా.. అసలైన పోటీ మాత్రం హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాలలో ఉన్న గ్రామీణ ఓటర్ల మనసుల్లో నడుస్తోంది. పల్లె నుంచి వలస వెళ్లిన వారి ఓట్లు ఒక్కో గ్రామానివి రెండొందలకు పైగా ఉండటంతో.. ఒక్క ఓటు కూడా చేజారకుండా చూసుకోవాలని అభ్యర్థులు విందులు, వినోదాలు, రవాణా సదుపాయాలు, వ్యక్తిగత రిక్వెస్టులతో పట్నం వైపు పరుగులు తీస్తున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి ప్రతి అస్త్రాన్నీ ఉపయోగిస్తున్నారు. కొంతమంది తమ స్నేహితులు, బంధువులు, సంఘాల ద్వారా నగర ఓటర్లను కలిసే ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు విలువను అర్థం చేసుకున్న అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడడం లేదు. ఎందుకంటే గతంలో ఎన్నో సార్లు ఒక్క ఓటుతోనే గెలిచిన, ఓడిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చినప్పుడు టాస్ వేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దాంతో ఇప్పుడు పంచాయతీ పోటీ కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్నానికి చేరిందని చెప్పొచ్చు. పల్లె ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించేందుకు గ్రామంలోని ఓటరే కాకుండా, నగరాల్లో తమ ఊరి జ్ఞాపకాలను మోస్తున్న ఓటరు కీలకంగా మారారు. ఇక ఈసారి ఆ పట్నం ఓట్లు ఎవరిని మచ్చిక చేసుకుంటాయో అన్నదే పల్లె రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మెజారిటీ నిర్ణయించేది ఇక్కడి ఓట్లే..

గ్రామ పంచాయతీ ఎన్నికలలో గెలుపుపై అనేక మంది ఉత్సాహంతో ఉన్నారు. ఊర్లలో కలిసి మెలిసి ఉండే వారే ఈ ఎన్నికలలో ప్రత్యర్థులుగా మారే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భంలో గ్రామంలోని ఓట్లు ఒకరికి తగ్గి మరొకరికి పెరిగే అవకాశం ఉన్నప్పుడు "పట్నం ఓట్లను" గంప గుత్తగా తమ ఖాతాలో చేసుకోవాలని అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పట్నం ఓట్లే సర్పంచ్ సీటు నిర్ణయించేందుకు కీలక పాత్ర పోషించనున్నాయి.

మొదలైన పార్టీలు..

నగరంతోపాటు శివారు ప్రాంతాలలో ఉన్న గ్రామీణ ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి ఇప్పటి నుంచే ముక్క, సుక్క పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అదే ఈ దావత్‌లు గ్రామాల్లో ఏర్పాటు చేస్తే అది ఎన్నికల నిబంధనల కిందకు వస్తుంది. ఇక్కడ అయితే ఎవరూ పట్టించుకోరని అభ్యర్థులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలానా ఓట్లు మనకు ఖచ్చితంగా పడాలి.. వారికి ఎలాంటి ఏర్పాటైనా చేయడానికి వెనుకడుగు వేయొద్దు అంటూ పోటీలో ఉన్న అభ్యర్థులు తమ బంధువులు, అనుచరులు నమ్మకస్తులు, సామాజిక తరగతుల వారికి అప్పగిస్తున్నారు.

'ఎందరో మహానుభావుల్లో లక్ష్మీనారాయణ ఒకరు'

ప్రజాశక్తి -కల్చరల్

సమాజంలో నాడు ఉన్న అసమానతలు అనాచారల నిర్మూలన కోసం ఉద్యమించిన వారు ఎందరో మహానుభావులు వున్నారని వారిలో ఉన్నవ లక్ష్మినారాయణ ప్రముఖులు అని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శంకరం అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా మారుతి కళా వేదికపై సోమవారం గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా ఉన్నవ లక్ష్మినారాయణ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకరం మాట్లాడుతూ ఉన్నత కుటుంబం లో పుట్టి విదేశాలలో బారిస్టర్ పట్టా పొంది గాంధీజీ పిలుపు మేరకు దళిత వుద్ధరణ కోసం పలు త్యాగాలు చేసిన లక్ష్మీ నారాయణ స్వాతంత్రోద్యమలో జైలు శిక్ష అనుభవించారు అని చెప్పారు అయన రచించిన మాల పల్లి నవల సంచలనం సృష్టించింది అన్నారు ఆయన ఆ నవల ను బ్రిటీష్ ప్రభుత్వం నిషేధం విధించింది అని గుర్తు చేశారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ భవాని శ్రీనివాస్ పి నాగేశ్వర రావు గిరి ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.